రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.టమాటా రూ.23, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 45, కాకరకాయ 38, బీరకాయ 38, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 15, క్యారెట్ 35, దొండ 23, ఆలుగడ్డ 24, ఉల్లిగడ్డ 24, గోకరకాయ 40, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ 23, అరటికాయ 10, చిక్కుడుకాయ 45, చామగడ్డ 28, మునగ 45, కందగడ్డ 45, బీట్‌రూట్ 33, కీర 35, బీన్స్ 55, క్యాప్సికమ్ 55. శనివారం ఉదయం 9 గంటల వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయి.

నేడు కామినేనిలో రక్తదాన శిబిరం

ఎల్‌బీనగర్: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ పీడియాట్రిక్ హెడ్ డాక్టర్ నరసింహారావు, బ్లడ్ సెంటర్ హెడ్ డాక్టర్ వివేకానంద, మార్కెటింగ్ గ్రూప్ హెడ్ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించి స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకువచ్చి తలసేమియా బాధిత చిన్నారులకు తోడ్పాటునందించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీ క్వార్టర్స్, ముంతాజ్ కాలేజ్, హనుమాన్ టెంపుల్ పరిసర ప్రాంతాలు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు ఆస్మాన్‌ఘడ్, వెంకటాద్రినగర్, ఆర్‌బీ కాలనీ పరిసర ప్రాంతాలు.ఉదయం 10 నుంచి 10:30 వరకు ఫకీరీగల్లీ, జమాల్ కాలనీ, పోచమ్మ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ఎల్‌బీనగర్: డివిజన్‌లో సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. టీచర్స్ కాలనీ ఫేజ్-2, బృందవన్ మెడోస్, మైల్‌స్టోన్ డెవలపర్స్ కాలనీల్లో ఓపెన్ జిమ్, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. సాహెబ్‌నగర్ శ్మశాన వాటికలో వీధి దీపాలు, ప్రహరీ నిర్మాణంతో పాటు రంగులు వేయాలని కోరారు. ఎన్‌జీఓఎస్ కాలనీలోని ఉమెన్ థీమ్స్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, ప్రహరీకి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.

వరద ముంపునకు శాశ్వత పరిష్కారం



వరదనీటిని దారి మళ్లిస్తున్న ఆలయ సిబ్బంది

చంపాపేట: వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ ఈఓ లావణ్య పేర్కొన్నారు. ఆలయ ప్రధాన ద్వారం ఎదుట నిలిచిన వరదనీటిని శుక్రవారం దారి మళ్లించి భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడామని భక్తుల రద్దీ లేని రోజున ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం ఎదుట రహదారికి సమాంతరంగా వరదనీటి కాలువతో పాటు సీసీ రోడ్డు పనులు కూడా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రమాదేవి, వెంకటయ్య, అంబా ప్రసాదు, ప్రవీణ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేటలో ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

చంచల్‌గూడ: మాదన్నపేట పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఎస్‌ఐ కర్నమళ్ల వెంకటరమణ హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌కు, ఎస్‌ఐ తోహెరుద్దీన్ సీసీఎస్ డీడీకి బదిలీ అయ్యారు. ఇరువురి స్థానంలో సౌత్‌ఈస్ట్ జోన్‌లో అటాచ్‌మెంట్‌లో ఉన్న కె. కృష్ణ, సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పీఎస్ నుంచి కంచం సుధాకర్ మాదన్నపేట పోలీసుస్టేషన్‌కు వచ్చారు. మలక్‌పేట డీఐగా ఉన్న పి. ఆంజనేయులు ఇటీవల మాదన్నపేట ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

5 సర్కిళ్లు.. 4.53 లక్షల మొక్కలు..!



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

- వన మహోత్సవానికి అధికారుల సన్నద్ధం
- నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు

ఎల్‌బీనగర్: వన మహోత్సవం కార్యక్రమానికి హార్టికల్చర్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని 5 సర్కిళ్లకు చెందిన అధికారులు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అన్ని డివిజన్లలో కాలనీల్లో సుమారు 4.53 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రోడ్లకిరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, శ్మశానవాటికలు, పార్కులు, ఇన్నర్‌రోడ్ల వెంబడి ఇళ్ల ముందు, ఫ్లై ఓవర్ల కింద, అర్బన్ ఫారెస్టు ప్రదేశాల్లో మొక్కలు నాటేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏ సర్కిల్‌కు ఎన్ని మొక్కలు..

ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని 5 సర్కిళ్ల పరిధిలో సుమారుగా 4.53 లక్షల మొక్కలు నాటాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. పెద్ద మొక్కలు సుమారుగా 42,115, చిన్న మొక్కలు 2,73,980 ఇవిగాకుండా కాలనీవాసులకు ఇతర స్వచ్ఛంద సంస్థలకు మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చే వారికి కూడా ఉచితంగా మరో 1,37,000 మొక్కలు పంపిణీ చేయనున్నారు.

- కాప్రా సర్కిల్‌లో పెద్ద మొక్కలు 4,345, చిన్నవి 58,300 ఉన్నవి. పంపిణీ చేయనున్న మొక్కలు 33,044.ఈ సర్కిల్‌లో మొత్తం 95,689 మొక్కలు నాటనున్నారు.
- ఉప్పల్ సర్కిల్‌లో 10,400 పెద్ద మొక్కలు, చిన్నవి 65,330, పంపిణీ చేసే మొక్కలు 28,695. కాగా మొత్తం 1,04425 మొక్కలు నాటనున్నారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్-3లో 5,620 పెద్ద మొక్కలు, 66,100 చిన్న మొక్కలు, పంపిణీ చేసే మొక్కలు 16,696. సుమారుగా 88,416 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్-4లో 14,500 పెద్ద మొక్కలు, 40,500 చిన్న మొక్కలు. పంపిణీ చేసేవి 28,695. మొత్తం 83,695 మొక్కలు నాటనున్నారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్-5లో 7,250 పెద్ద మొక్కలు, చిన్నవి 43,750 పంపిణీ చేసేవి 29,870. ఈ సర్కిల్ పరిధిలో 80,876 మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రణాళికలు సిద్ధం చేశాం: డీడీ

వన మహోత్సవంలో భాగంగా 5 సర్కిళ్ల పరిధిలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేలా స్థలాలు గుర్తించామని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ తెలిపారు. రోడ్లకిరువైపులా, చెరువు కట్టలు, పార్కులు, ఇళ్ల ముందు మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ ఇంటి ఎదుట మొక్కలు నాటి సంరక్షించాలని ఆమె కోరారు.

సిద్ధంగా ఉన్న మొక్కలు..

వివిధ నర్సరీలో పలు రకాలు మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. తులసి, ఉసిరి, చింత, పాపాయి, నేరేడు మొక్కలు ఇంటి ముందు నాటేందుకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇక ఖాళీ ప్రదేశాల్లో గానుగ, వేప మిల్లింగ్‌టానియా, పోటాడియా లాంటి ఏపుగా పెరిగే వృక్షాలను నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



ఆయిల్‌మిల్ వద్ద అధికారులతో చర్చిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవపాటిల్

ఎల్‌బీనగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ అన్నారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యతో కలిసి మన్సూరాబాద్ డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ డివిజన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. జడ్జెస్‌కాలనీ ఫేజ్-1లోని హిందూ శ్మశానవాటికను మోడల్ శ్మశానవాటికగా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కేబీఆర్ కన్వెన్షన్, కాస్మోపాలిటన్ కాలనీల నంచి వచ్చే వరదతో వీకర్‌సెక్షన్ కాలనీ ముంపునకు గురవుతుందని, త్వరలోనే వరదకాలువ పనులు చేపడుతామని పేర్కొన్నారు. మన్సూరాబాద్ సహారా రోడ్డు ఆయిల్‌మిల్ వద్ద ఓపెన్ నాలాను ఆధునీకరించి, వరద రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ రమేశ్‌బాబు, డీఈ కనకయ్య, ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, శానిటేషన్ డీఈ నీలిమా పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



లింగోజిగూడ: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉప్పల శ్రీనివాస్ గుప్తాను పలువురు కాంగ్రెస్ నాయకులు నాగోల్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బండ్లగూడ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణగౌడ్, నాయకులు నరేశ్‌కుమార్, వెంకటేశ్, రవీందర్, మెట్టు విజయ్, సాయిచరణ్, నరేందర్, సాయిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌వాసులపై దాడి సరికాదు



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

సైదాబాద్: అపార్ట్‌మెంట్‌వాసులపై దాడి సరికాదని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్‌లో ఎలైట్‌హిల్స్ అపార్ట్‌మెంట్ వద్ద అక్రమ నిర్మాణాన్ని ప్రశ్నించిన అపార్ట్‌మెంట్ వాసులపై ఓ వర్గానికి చెందిన బిల్డర్ అనుచరులు దాడి చేయగా గాయపడి సైదాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు బ్రహ్మానందంను సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డితో కలిసి శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీతో లోపాయికారి ఒప్పందాలతో దాడులు చేస్తే ఇటుక దెబ్బకు రాయితో సమాధానమిస్తామని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ప్రశ్నించిన వారిపై దాడి అమానుషం

సైదాబాద్: జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపట్టిన వారిని ప్రశ్నించిన వారిపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. మలక్‌పేట రాక్ చర్చి సమీపంలోని ఎలైట్ హిల్స్ అపార్ట్‌మెంట్ వద్ద అక్రమ నిర్మాణాన్ని వారించినందుకు బిల్డర్ అనుచరులు చేసిన దాడిలో గాయపడిన అపార్ట్‌మెంట్ వాసి బ్రహ్మానందం సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి ఆమె బాధితుడిని పరామర్శించారు. జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి ఉన్నారు.

నాలా పనుల పరిశీలన

లింగోజిగూడ: మోహన్‌నగర్ కాలనీలో రూ.52 లక్షలతో చేపట్టిన నాలా పనులను కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కాలనీ వాసులు, అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నీరు వెళ్లేందుకు లెవల్స్ సరిగ్గా చూసుకుని పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ షరీఫ్, కాలనీవాసులు వినోద్‌కుమార్, ప్రవీణ్, ప్రసాద్, రాజశేఖర్, రామ్‌రెడ్డి, సుందర్, నారాయణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా ఆలయాల బ్రహ్మోత్సవాలు



దుర్గాదేవి ఆలయంలో పూర్ణాహుతి..



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: నాగోలు డివిజన్ సాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గమన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి శుక్రవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7-30 నుంచి 10 గంటల వరకు దుర్గాదేవి చతుష్షష్టి ఉపచారపూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కాలనీ మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాల వేలం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, రమణమూర్తి, కేశవులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

డివిజన్ పరిధి ఆదిత్యానగర్‌కాలనీలోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, రవీందర్, జీకే గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి ఆలయం..

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ దేవరం లింగారెడ్డి తెలిపారు. శుక్రవారం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపన భక్తులచే గరుడ ఇష్టి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం కొడూరు పద్మ బృందంచే సౌందర్యలహరి పారాయణం చేశారు. ఆదివారం స్వామి వారి కల్యాణ మహోత్సవం ఉంటుందని భక్తులు పాల్గొనాలని చైర్మన్ కోరారు. మాజీ చైర్మన్ వూర నర్సింహ గుప్తా, చకిలం రమణయ్య, చిదర నాగేందర్, వక్కలంక శ్రీనివాస్‌రావు, బచ్చు సత్యనారాయణ, కుమారస్వామి, పాల్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నలుగురి అరెస్ట్

మలక్‌పేట: అక్రమ నిర్మాణాలు అడ్డుకున్న అపార్ట్‌మెంట్‌వాసులపై దాడి చేసిన నలుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్ తెలిపారు. అస్మాన్‌ఘడ్‌లో ఎలైట్ హిల్స్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ బిల్డర్ మసీయుద్దీన్‌ఖాన్ తన అనుచరుడు కలీమ్‌ఖాన్ మరో ముగ్గురు జీహెచ్‌ఎంసీ నిబంధనలు పాటించకుండా, హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా పార్కింగ్ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టేందుకు గురువారం వారిని అపార్ట్‌మెంట్ వద్దకు పంపారు. అదేసమయంలో అపార్ట్‌మెంట్ వాసి కామేశ్వరి, ఆమె మేనల్లుడు బ్రహ్మానందం, ఇతర నివాసులు, ఫ్లాట్ యాజమానులు కలిసి దీనికి అభ్యంతరం తెలిపారు. నిర్మాణాలు ఆపేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. మసీయుద్దీన్ అనుచరులు అధికారులతో మాట్లాడుతున్నారు. అభ్యంతరం వ్యక్తం చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులను దుర్భాషలాడుతూ.. నివాసితుడు బ్రహ్మానందంపై ద్వేషంతో దుర్భాషలాడుతూ దాడి చేశారు. అపార్ట్‌మెంట్ వాసులు, మహిళలు వారిని ఆపేందుకు యత్నించగా మహిళలను అసభ్యకరంగా తిట్టారు. కలీమ్‌ఖాన్, అతని అనుచరులు అందరిని చంపేస్తామని బెదిరిస్తూ అక్కడ నుంచి పారిపోయారు. గతంలో భార్గవ్ దీక్షిత్, సి. సరిత, వి.ప్రవీణ్, ఏ, అరుణరెడ్డి, డి. అనసూయ, డి. శ్రీధర్‌పై దాడి చేసినట్లు కామేశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మసీయుద్దీన్‌ఖాన్, ఖలీల్, ఇషాక్, అర్షద్, జావీద్‌పై కేసు నమోదు చేశామని, మసీయుద్దీన్‌ఖాన్ పరారీలో ఉండగా మిగిలిన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రశాంత్‌నగర్ కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ ఔట్‌లెట్ సరిగా లేక చిన్నపాటి వర్షాలకే నీరు నిలుస్తోందని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయన స్పందిస్తూ రోడ్డు వెనుక ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలం ఉందని వారితో మాట్లాడి నూతన డ్రైన్స్ నిర్మాణం చేపడతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్, కాలనీవాసులు బాలాజీనాథ్, కరుణాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, పద్మారెడ్డి, నాయకులు మిట్టా రాంమోహన్ పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో త్వరగా క్యూరింగ్



తాపీమేస్త్రీలకు బీమా బాండ్లు అందిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

హయత్‌నగర్: ప్రత్యేక టెక్నాలజీ గల భారతి 5 స్టార్ గ్రేడ్ అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో క్యూరింగ్ త్వరగా జరుగుతుందని భారతి సిమెంట్స్ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహేర్ అన్నారు. హయత్‌నగర్‌లోని నాగార్జున స్టీల్స్ డీలర్ షాపులో తాపీ మేస్త్రీలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్లాబులు, పిల్లర్లు, రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణంలో భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వినియోగదారుల కోరిక మేరకు కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజినీర్లు సైటు వద్దకే వచ్చి సలహాలు, సూచనలు ఇచ్చి సహకారం అందిస్తారని తెలిపారు. మార్కెట్‌లోని ఇతర సిమెంట్ కంటే బస్తాకు రూ. 20 రేటు ఎక్కువ ఉన్నా భారతి సిమెంట్ నాణ్యత గలదని పేర్కొన్నారు. డీలర్లు ప్రబోద్‌రెడ్డి, సందీప్‌రెడ్డి మాట్లాడుతూ..భారతి సిమెంట్ సర్వీసు వేగంగా ఉంటుందని నాణ్యత, పటిష్ఠత బాగుంటుందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ. లక్ష విలువైన ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో పలువురు టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మలక్‌పేట: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసారంబాగ్‌కు చెందిన పి. రాముయాదవ్ కుమారుడు సందీప్‌యాదవ్ (33) పాల వ్యాపారి. గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్లాడు. రాత్రి తన గదిలోకి వెళ్లి నిద్రించాడు. ఉదయం గది నుంచి బయటికి రాలేదు. దీంతో గదిలోకి చూసేసరికి మంచంపై విగత జీవిగా పడి ఉన్నాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, ఆర్థిక సమస్యలు, ప్రేమ విఫలమా, మరే ఇతర కారణాల వలన ఆత్మహత్య చేసుకున్నాడా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



మోహన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

లింగోజిగూడ: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నాగోలు జడ్పీ పాఠశాల, జైపూర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరభ్యానం చేయించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్కులు, యూనిఫామ్‌లు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

మోహన్‌నగర్‌లో..

కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ప్రిన్సిపాల్ అంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి బుక్స్ అందజేశారు. కొత్తపేట గ్రామ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు సునీత, అరుణ, జ్యోతి, సంధ్య, అంజనాదేవి, శైలజ పాల్గొన్నారు.

డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో ముందుకెళుతున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో రూ. 56.50 లక్షలతో నిర్మించనున్న హస్తినాపురం ఈస్ట్ ఫేజ్-1, క్రిస్టియన్ కాలనీ రోడ్డు నెం.2 కనెక్టివిటీ సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మధుయాష్కీ,గౌడ్ సహకారంతో నిధులు తీసుకువచ్చి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ విఘ్నేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షుడు హరిందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, హస్తినాపురం ఈస్ట్ ఫేజ్-1 అధ్యక్షుడు భూపతిరెడ్డి, రామచంద్రారెడ్డి, శేఖర్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఎల్‌బీనగర్: అహ్మదాబాద్ జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, ఎల్‌బీనగర్ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. విమానం నివాసాలు, మెడికల్ కళాశాల హాస్టల్ భవనంపై కూలిపోవడంతో విద్యార్థులు దుర్మరణం చెందడంతో పాటు పలువురు క్షతగాత్రులయ్యారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు సీపీఐ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందని పేర్కొన్నారు.

మైనర్‌పై లైంగికదాడి

క్యాబ్ డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

హస్తినాపురం: ఓ క్యాబ్ డ్రైవర్ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఎన్ రెడ్డినగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్న మైనర్ బాలిక (17) కు ఇన్‌స్టాగామ్‌లో సాహెబ్‌నగర్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ సన్నీ (21) పరిచమయ్యాడు. బాలికకు మాయమాటలు చెప్పి 2 నెలలుగా సాహెబ్‌నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్న ఇంట్లోనే లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే బాలిక తల్లిదండ్రులను హతమారుస్తానని బెదిరించడంతో బాలిక ఎవరికీ చెప్పలేదు. ఈనెల 11న మధ్యాహ్నం బాలికను వెంటనే తన ఇంటికి రావాలని సన్నీ బెదిరించడంతో వెళ్లిపోయింది. తర్వాత బాలిక తల్లి తన కూతురు ఎక్కడికి వెళ్లిందని ఆరా తీయడంతో సన్నీ అనే క్యాబ్ డ్రైవర్ తనకు మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడని ఈవిషయం మీ ఇంట్లో వారికి చెబితే మీ తల్లిదండ్రులతో పాటు మీ కుటుంబ సభ్యులందరిని చంపేస్తానని బెదిరించడంతో వెళ్లినట్లు బాలిక తన తల్లికి చెప్పింది. అందులో భాగంగానే ఈ నెల 11న మధ్యాహ్నం సాహెబ్‌నగర్‌లోని సన్నీ వాళ్ల ఇంటికి వెళ్లానని మైనర్ బాలిక గురువారం తన తల్లి కి చెప్పింది. దీంతో బాలిక తల్లి గురువారం రాత్రి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు క్యాబ్ డ్రైవర్ సన్నీపై పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.